క్లుప్తంగా

నేడు వినుకొండలో ప్రజావేదిక

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 15వ ప్రజావేదిక శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై14వ తేదీ వరకు సోషల్ ఆడిట్ చేయడం జరిగిందన్నారు.

రేపు జనరల్ బాడీ సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16న మధ్యాహ్నం 2.00 గంటలకు సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య గురువారం తెలిపారు. అలాగే వేల్పూరు గ్రామంలో ఉదయం 11 గంటలకు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు.

రుణమేళాపై అవగాహన

బొల్లాపల్లి: జగనన్న పాలవెల్లువలో భాగంగా పాల సేకరణ సెంటర్‌లో మహిళా పాడిరైతులకు గేదెల కొనుగోలుకు రుణాలు అందజేస్తామని ఈపూరు పశువైద్య సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని పేరూరుపాడు గ్రామంలో జగనన్న పాలవెల్లువలో మహిళా పాడిరైతులకు రుణమేళ అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ ఎం.స్వాతి, వెల్లటూరు పశువైద్యాధికారి జి.కవిత, డీఆర్‌డీఏ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

17న విశ్వకర్మ జయంతి

శావల్యాపురం: శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వశాంతి యజ్ఞ మహోత్సవాలు మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో 17న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు మండల విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధి పి.సురేష్ గురువారం తెలిపారు.

ఉచిత ఓపీ సద్వినియోగం చేసుకోండి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక తిరుమల నర్సింగ్ హోంలో ఆరోగ్య శ్రీ, ఇన్సూరెన్స్ సేవలతో పాటు ఉచిత ఓపీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కూరపాటి అప్పిరెడ్డి తెలిపారు. తిరుమల నర్సింగ్ హోమ్ ఐదేళ్ల వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, సంధ్య, కిషోర్‌కుమార్, శ్రీవర్ధన్, యమున, కావ్యలతో కలిసి అప్పిరెడ్డి రోగులకు, బాలింతలకు బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేశారు.

16న ఎస్‌జీఎఫ్ ఎంపికలు

రొంపిచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 16న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్) సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ, వ్యాయామ ఉపాధ్యాయులు వై.సైదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్లలో పాల్గొనే క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ వంటి 9 రకాల క్రీడలు నిర్వహిస్తారన్నారు. ఈ సెలక్షన్స్‌లో మండలంలోని అన్ని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు అన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

దివ్యాంగులకు స్క్రీనింగ్ క్యాంప్

బొల్లాపల్లి: స్థానిక రైతు భరోసా కేంద్రంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైబిల్, కమిట్‌మెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారుల సహకారంతో గురువారం పలు లోపాలు ఉన్న దివ్యాంగులకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి కావల్సిన ఉపకరణాలు నమోదు చేసుకున్నారు.

రేపు భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో ఈనెల 16న ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో జలజీవన్ మిషన్ నిధులు రూ. కోటి 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు భూమి పూజ జరుగుతుందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలోని అన్నవరం మేజరు నుంచి మంచినీటి చెరువుకు వరకు 1850 మీటర్ల పైపులైను నిర్మాణ పనులతో పాటు వెలమవారిపాలెం గ్రామంలో నూతనంగా 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు భూమి పూజ చేస్తారన్నారు.

పింఛనుదారుల్లో నూతనోత్సాహం


పెన్షన్ పత్రాలను అందుకుంటున్న టీడీపీ వార్డు సభ్యుడు షేక్ చినమౌలాలి


కొచ్చర్లలో క్షీరాభిషేకం చేసి పింఛన్ పత్రాలను చూపిస్తున్న లబ్ధిదారులు


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేడం జయరామిరెడ్డి


లింగారావుపాలెంలో దివ్యాంగురాలికి వైఎస్సార్ పింఛన్ కానుక నగదు అందిస్తున్న సర్పంచ్


గుంటుపాలెంలో నూతన పింఛనుదారుడికి నగదు అందజేస్తున్న కన్వీనర్ అంకారావు


లింగారావుపాలెంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


నరసరావుపేటలో నూతన పింఛన్ అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ రమణారెడ్డి

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామ సచివాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద నూతనంగా మంజూరైన 45 పింఛన్లను సర్పంచ్ కోపెల దేవరాజ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోలి వెంకటేశ్వరరావు, జాగర్లమూడి రామారావు, సచివాలయ కన్వీనర్ జి. వెంకటేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముప్పరాజువారిపాలెంలో..

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ముప్పరాజువారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన 27 పింఛన్లను ఎంపీపీ మేడం జయరామిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ చిననాగిరెడ్డి పాల్గొన్నారు.

గుంటుపాలెంలో..

శావల్యాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హత కలిగిన పేదలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు అన్నారు. గురువారం మండలంలోని గుంటుపాలెం గ్రామంలో నూతన పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ అంకారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో కులమతాలకు రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆయన వివరించారు.

లింగారావుపాలెంలో ...

యడ్లపాడు: వైఎస్సార్ పింఛన్ కానుక కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ కరీమూన్ చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని జెడ్పీహైస్కూల్ సమీపంలోని ఏరియాలో నివాసం ఉండే దివ్యాంగురాలు మేడ గాయత్రీకి కొత్తగా మంజూరైన పింఛన్ డబ్బుల్ని సర్పంచ్ అందజేశారు. అనంతరం గ్రామ సచివాలయం కన్వీనర్ ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ శొంఠినేని శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తోకల వీరరాఘవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మాబుసుభాని, మండెపూడి శ్రీనివాసరావు, నంబూరి శివరామకృష్ణ, బ్రహ్మం చేతుల మీదుగా కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు గ్రామపరిధిలో సామాజిక పింఛన్లు మొత్తం 425 ఉన్నాయన్నారు. ఈనెల నుండి కొత్తగా మరో 27 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

నరసరావుపేటలో..

నరసరావుపేట: పురపాలక పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన వైఎస్సార్ పింఛన్ కానుకల పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. మొత్తం 34 వార్డులకు సంబంధించి 253 నూతన ఫించన్లు మంజూరయ్యాయి. వార్డుల్లోని సచివాలయ సంక్షేమ కార్యదర్శులు, వలంటీర్ల సహాయంతో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారు. గురువారం పది, 14వ వార్డుల్లో మాజీ కౌన్సిలర్ మాగులూరు రమణారెడ్డి, బండి వెంకటేశ్వరరెడ్డి లబ్ధిదార్లకు పింఛన్ అందజేశారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు: మండలంలో నూతనంగా 384 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో రంగనాయకులు తెలిపారు. గతంలో 5900 పింఛన్లు ఉన్నాయని నూతనంగా మంజూరైన వాటితో కలిపి 6284 పింఛన్లు అయినట్లు ఆయన పేర్కొన్నారు. 17 గ్రామపంచాయతీలకు కలిపి పింఛన్లు మంజూరయ్యాయనితెలిపారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: మండలంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక–సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ గురువారంతో ముగిసింది. 16 సచివాలయాల పరిధిలో 406 పెన్షన్లు మంజూరు కాగా, రూ.11,33,750లను వలంటీర్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందించారు.

టీడీపీ వార్డు సభ్యుడికి పింఛను

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా మండలంలోని అల్లూరివారిపాలెంలో నూతనంగా మంజూరైన్ పెన్షన్‌లను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేంపాటి వెంకటప్పారెడ్డి, సర్పంచ్ భవనం నర్సిరెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నూతనంగా పెన్షన్ మంజూరైన 21 మందికి పెన్షన్‌లను అందజేశారు. పెన్షన్‌లు మంజూరైన వారిలో టీడీపీకి చెందిన పంచాయతీ 10వ వార్డు సభ్యుడు షేక్ చిన మౌలాలి ఉన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వై.రాజశేఖరరెడ్డి, మైలా ఆంజనేయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వారిద్దరూ కలిసి వచ్చినా గెలుపు మాదే

- పవన్ ప్రకటనలో కొత్తదనం లేదు
- కుంగిపోయిన టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కోసమే పవన్ ప్రకటన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ, ఇతర పార్టీలు అన్ని కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీ సింగిల్‌గానే పోటీచేసి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలు చేపట్టడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సాక్షి మీడియాతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయంటూ పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనపై స్పందించారు. వారిద్దరూ కలిసి పోటీ చేయటమనేది ఇప్పుడేమి కొత్తకాదన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో కూడా వారిద్దరూ కలిసే పోటీచేస్తారని తమ పార్టీ ముందే ఊహించిందేనన్నారు.

2014 నుంచే చంద్రబాబుతో కలిసి పవన్ అడుగులు వేస్తున్నాడన్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీకి బహిరంగంగా మద్దతు పలికాడన్నారు. 2019లో అప్పటి వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంపై ఉన్న నెగటివ్ ఓటును చీల్చాలనే ఉద్దేశ్యంతో విడిగా పోటీ చేశాడన్నారు. ఇది వారిద్దరి మధ్యనున్న అంగీకారం మేరకే జరిగిందన్నారు. దత్తపుత్రుడితో కలిసి చంద్రబాబు పోటీచేసినా, లేదా సింగిల్‌గా పోటీచేసినా తప్పకుండా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు. ఓటుకు నోటుకేసులో చంద్రబాబు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడితే నోరు మెదపని వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు సీఎం హోదాలో 13 సంతకాలు చేశాడన్నారు. నిధుల దుర్వినియోగానికి అతనే బాధ్యత వహించాలన్నారు. సివిల్ వార్, యుద్ధమని మాటాడే పవన్ ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నాడని ప్రశ్నించారు. రెండు, మూడు నెలలకు ఒకసారి రాష్ట్రానికి వచ్చే పవన్‌ను ఎవరూ అడ్డుకోలేదన్నారు. ప్రచారం కోసం తనను అడ్డుకుంటున్నారని ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. ప్రభుత్వమే అడ్డుకుంటే వారాహీ యాత్ర చేసేవాడా అని ప్రశ్నించారు.

చంద్రబాబు అరెస్టుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుంగిపోయారన్నారు. బాబు కోరికపై వారిలో ఉత్సాహం నింపేందుకే తామిద్దరమూ కలిసి పోటీ చేస్తామంటూ ప్రకటించాడన్నారు. నిజంగా కలిసి పోటీ చేస్తే తనకు ఎన్నిసీట్లు ఇస్తున్నారో ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. బీజేపీతో మిత్రపక్షమై ఉండి ఆ పార్టీకి సంబంధం లేకుండా టీడీపీతో కలిసి పోటీచేస్తానంటూ ప్రకటిస్తున్నాడని, చంద్రబాబుకు అమ్ముడు పోవటం వల్లే పవన్ ఈవిధంగా చేస్తున్నాడని ఎమ్మెల్యే గోపిరెడ్డి స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న హిందీ దివస్

చిలకలూరిపేటలో అక్షరాకృతి

చిలకలూరిపేట: జాతీయ హిందీ దినోత్సవంగా (హిందీ దివస్) సెప్టెంబర్ 14ను నిర్వహించుకుంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యను తెలియజేస్తూ గురువారం పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హిందీ దివస్ అక్షరాకృతిగా ఏర్పడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎం.కె.కృపాదానం, హిందీ ఉపాధ్యాయులు షేక్ నజీమాబాను, డి.సుహాసిని పాల్గొన్నారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: విభిన్న భాషలతో అలరారుతున్న భారతదేశంలో, పౌరులందరి ఉమ్మడి భాషగా జాతీయ భాష హిందీ విశేష పాత్ర పోషిస్తున్నదని హెచ్‌ఎం కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష ఉన్నతికి కృషి చేసిన కవి, రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. 1949లో హిందీని జాతీయ భాషగా గుర్తించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ పద్య, పాటలు, వక్తృత్వం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఉషారాణి, హిందీ ఉపాధ్యాయులు సత్తెనపల్లి కొండలరావు, ఎ.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు రత్నరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి విజయవంతంగా ఫేస్‌మేకర్


పేషెంట్ సీతారావమ్మతో డాక్టర్ లోకిరెడ్డి

నరసరావుపేట: స్థానిక డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ వైద్యులు జిల్లాలో తొలిసారిగా 77 ఏళ్ల వృద్ధురాలైన సీతారావమ్మ గుండెకు ఫేస్‌మేకర్ ఏర్పాటు చేశారు. గురువారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హాస్పిటల్ అధిపతి డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి వివరాలను వెల్లడించారు. తీవ్రమైన కడుపు, ఛాతి నొప్పితో పది రోజుల క్రితం పేషెంట్ హాస్పిటల్‌లో చేరిందన్నారు. ఆమెకు పరీక్షలు నిర్వహించగా గుండె నిమిషానికి కేవలం 30 నుంచి 36 సార్లు మాత్రమే కొట్టుకోవటం గమనించామన్నారు. సిటీ స్కాన్‌చేసి చూడగా పసరు సంచిలో రాళ్లు, చీము ఉన్నట్లుగా గుర్తించామన్నారు. సంబంధిత బంధువుల అనుమతితో తాత్కాలిక ఫేస్‌మేకర్ ఏర్పాటుచేసి లాప్రోస్కోపీతో పసరు సంచి తొలగించామన్నారు. ఆమె కొంత కోలుకున్న తర్వాత హాస్పిటల్‌లోని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ కోటా శభరిగిరీష్ సారథ్యంలో డాక్టర్లు మూడు గంటలపాటు శ్రమించి శాశ్వత ఫేస్‌మేకర్ ఏర్పాటు చేయడమైందన్నారు. హాస్పిటల్‌లో ఉన్నటువంటి కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, క్రిటికల్ కేర్ వైద్య బృందాలు సంయుక్తంగా పేషెంట్ ప్రాణాన్ని కాపాడారన్నారు.

సంక్షిప్త వార్తలు

అమెరికన్ డైమండ్ల వినాయకుడు

చిలకలూరిపేట: పట్టణంలోని షరాఫ్‌బజారులో గోల్డెన్ మర్చెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 29వ గణపతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పొట్టి రత్నబాబు గురువారం తెలిపారు. సుమారు రూ. 8 లక్షలు వెచ్చించి అమెరికన్ డైమెండ్స్‌తో వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కోల్‌కత్తా నుంచి విగ్రహం తెప్పించటం జరిగిందని వివరించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో ఆర్డీవో ఎం.శేషిరెడ్డి గురువారం పర్యటించారు. గ్రామంలో 16, 17 పోలింగ్ బూత్‌లను అక్కడి నుంచి మార్చాలని గ్రామస్తులు నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ప్రభుత్వ జీవోపై హర్షం

నరసరావుపేట: ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపు సంఘంగా ప్రభుత్వం జీవో విడుదల చేయటంపై ఆ యూనియన్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. గురువారం డిపో ఆవరణలో యూనియన్ జిల్లా కార్యదర్శి జీటీ రావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాస్, షేక్ మాబు గేట్ మీటింగ్ నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు.

జాతీయ పోటీలకు ఎంపిక

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని షేక్ కరీష్మా ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరి రావు తెలిపారు. కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పోటీలకు ఎంపికైన కరీష్మాను సత్కరించారు. నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో తమ విద్యాసంస్థలకు చెందిన నలుగురు విద్యార్థినులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్టు తెలిపారు.

క్రీడల్లో ఏఎంజీ విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో త్రోబాల్, టెన్నికాయిట్ పోటీలు బాపట్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులపాఠశాల ప్రాంగణంలో ఇటీవల నిర్వహించారు. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొనడం ద్వారా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. త్రోబాల్‌లో ప్రభాస్, అఖిల్, దుర్గాసాయి ఎంపిక కాగా, టెన్నికాయిట్ బాలికల విభాగంలో స్రవంతి, మౌనిక, బాలుర విభాగంలో సునీల్, నిఖిల్, సుధీర్ ఎంపికయ్యారు.

ఈ – క్రాప్ తప్పనిసరి

బొల్లాపల్లి: ఉద్యాన పంటల సాగు రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీరసూల్ తెలిపారు. మండలంలోని మేళ్లవాగు, గరికపాడు సచివాలయాల పరిధిలోని ఉద్యాన పంటల సాగును గురువారం సందర్శించి పరిశీలించారు. మండలంలో దానిమ్మ, మిరప తదితర పండ్ల తోటల సాగు చేపట్టారని, సంబంధిత రైతులు ప్రభుత్వ పథకాల రాయితీ వర్తించాలంటే ఈ -క్రాప్ నమోదు తప్పనిసరి అని తెలిపారు.

సంపూర్ణ పోషణ మాసోత్సవాలు

వినుకొండ (నూజెండ్ల): ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎ-సెక్టార్‌లోని సచివాలయం 8 పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎం. అనురాధ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహార కిట్లను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

కొనకంచివారిపాలెంలో..

రొంపిచర్ల: మండలంలో కొనకంచివారిపాలెం గ్రామంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవములు నిర్వహించారు. గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రములో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రదర్శించిన రాగులు, సజ్జలు, జొన్నలు, బఠాణీలు, అలచందలు, శనగలతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్స్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పానుగోటి నాసరరావు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో చేతిరాత కీలకం

యడ్లపాడు: విద్యార్థి విద్యలో చేతిరాత కూడా కీలకమేనని హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి తెలిపారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి విద్యార్థులకు క్యాలీగ్రఫీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి మాట్లాడుతూ చేతిరాతపై మంచి పట్టుఉంటే పరీక్షల్లో అత్యధిక మార్కుల్ని సాధించేందుకు చేతిరాత కీలకమని.. చక్కటి దస్తూరీతో పరీక్షలు రాస్తే పేపర్లు దిద్దే ఉపాధ్యాయులకు స్పష్టంగా అర్థం అవుతుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు.

గ్రామాల్లో వినాయక చవితికి ఏర్పాట్లు

యడ్లపాడు: వినాయక చవితిని పురస్కరించుకుని వాడవాడలా వినాయక చవితి పందిళ్లను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో వినాయక పందిళ్ల రాట కార్యక్రమాలను పూర్తి చేసి,పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. సంప్రదాయ రీతిలో వినాయక చవితిని నిర్వహించేందుకు మండపాలను తీర్చిదిద్దుతున్నారు.